
# అభిమానులొస్తున్నారు జాగ్రత్త!...

ఉదయం 5 గంటలు... ఇంకా చీకట్లు పోలేదు. నిరంజనరావు ఇంట్లో పనికిరాని అంచూడిపోయిన బోడిగిన్నెని ఒకదానిని పట్టుకుని వేటకు బయలుదేరాడు. నిర్మానుష్యంగా ఉన్న వీధుల్లో ఒక అయిదు నిముషాలు నడవగానే అతని టార్గెట్ కనిపించింది.




వయ్యారంగా కులుకుతూ నడుస్తోంది... ఒక గేదె... విలాసంగా తోకూపుతూ. నిరంజనరావుకి చెప్పలేని ఆనందం కలిగింది.

చుట్టూ ఓసారి కలియచూశాడు. ఆ గేదె తాలూకు మనిషి ఎవరూ కనిపించలేదు.

ఒక్క గెంతు గెంతి గేదె దగ్గరికి చేరి దాని వెనుకనే నడవసాగాడు నిరంజనరావు.

వెనుక అలికిడి అయ్యేసరికి గేదె వెనక్కి తిరిగి బెదురు చూపులు చూసింది.

“డుర్... హె... భయపడకు...” అని “ఛక్... ఛక్” అంటూ నోటితో శబ్దం చేసి చేతిలోని బోడిగిన్నెని గేదెకి చూపించాడు.

గేదె బెదురుచూపులు మాని ఓమారు నిరంజనరావుని చూసి మళ్ళీ ముందుకు తిరిగి మామూలుగా నడవసాగింది. దానికి తన వెనకాల ఇలా గిన్నెలు పట్టుకుని నడిచేవాళ్ళు అలవాటే... వాళ్ళేమీ చేయరని దానికి తెలుసు. అందుకే అది తాపీగా నడవసాగింది. నిరంజనరావు ఓపిగ్గా కొంతదూరం దాని వెనకాల నడిచాడు.

కాస్సేపయ్యాక గేదె హఠాత్తుగా తోకెత్తింది. ఆ క్షణం కోసమే ఎదురుచూస్తున్న నిరంజనరావు తన బోడిగిన్నెను దాని తోకకింద పెట్టాడు.

నిరంజనరావు గుండె ఆనందంతో గంతులు వేయసాగింది.

ఒకటి... రెండు... మూడు...

క్షణాలు గడుస్తున్నాయ్... ఎత్తిన తోక ఎత్తినట్టే ఉంది గానీ నిరంజనరావుకి కావలసింది రాలేదు.

గేదె హఠాత్తుగా తోక దింపేసింది. నిరంజనరావు భారంగా నిట్టూర్చాడు. కాస్సేపు అయిన తరువాత గేదె మళ్లీ తోకెత్తింది. ఆలస్యం చెయ్యకుండా నిరంజనరావు మళ్ళీ దాని తోకకింద గిన్నె పెట్టాడు. గేదె మళ్ళీ తోక దింపేసింది.

అలా నిరంజనరావుని మరో మూడుసార్లు ఆశపెట్టింది గేదె.

'హు... దీనికి తోకెత్తడం హాబీ అనుకుంటా' అనుకున్నాడు నిరంజనరావు.

తలతిప్పి చూసేసరికి తన ఇంటిముందునుండే నడుస్తున్నాడు.

అంటే కాలనీలో ఒక రౌండు కొట్టాడన్నమాట. టైమ్ చూశాడు.

"అమ్మో!... అయిదుంపావు అయ్యింది... ఆరు దాటనీకుండా తన పని కానివ్వాలి!!..." అనుకున్నాడు.

అతనికి వెంటనే ఒక ఆలోచన వచ్చింది.

వెంటనే గేదెని తన ఇంటి కాంపౌండులోకి తోలుకుపోయాడు.

వారం క్రితం టీవీలో గేదెల పెంపకం గురించి విజ్ఞానదాయకమైన కార్యక్రమం చూశాడు. అందులో పేడని ఎలా సంపాదించాలి... దాంతో పిడకలు ఎలా తయారుచెయ్యాలీ అన్నది చాలా చక్కగా హృదయాలకు హత్తుకునేలా చూపించారు.

నిరంజనరావు టీవీవాళ్ళు చెప్పిన ప్రకారం గేదె పెరట్లోని గడ్డిని కడుపునిండా తినేలా చేశాడు. తరువాత ఒక దుడ్డుకర్రతో గేదె నడుం జారేలా కొట్టాడు.

అంతే...

నిరంజనరావు బోడిగిన్నె నిండింది. అతను గేదెని వదలిపెట్టి బోడిగిన్నె తీసుకుని సంతోషంగా సెంటర్‌కి వెళ్ళాడు. అక్కడ జనసంచారం లేదు. ఒకసారి కసిగా తన ముందున్న కొత్తసినిమా హోర్డింగ్ వైపు చూశాడు. ఆ సినిమా హోర్డింగ్ అంతకు ముందురోజు సాయంత్రమే పెట్టారు. ఆ సినిమాలో నట్రాజు హీరోగా వేశాడు... అదీ నిరంజనరావుకి మంట. నిరంజనరావు అభిమాన హీరో భావరాజు! ఆ కాలనీలో ఉన్న భావరాజు అభిమాన సంఘానికి నిరంజనరావు ప్రెసిడెంట్ అయితే నట్రాజు అభిమాన సంఘానికి వెంకట్రావు ప్రెసిడెంటు. ఆ విధంగా నిరంజనరావుకి వెంకట్రావు ఎగస్పార్టీ వాడన్నమాట!

తన యగస్పార్టీ హీరో బొమ్మ కనబడగానే నిరంజనరావులో ఆవేశం పెల్లుబికింది.

బోడిగిన్నెలోంచి పేడతీసి ఫటఫటా పోస్టరుకి కొట్టి వెర్రి ఆనందంతో మెలికలు తిరిగిపోయాడు.

బోడిగిన్నె ఖాళీ అయిపోయింది.

ఆ తరువాత ఆ ప్రక్కనే ఉన్న తన అభిమాన హీరో భావరాజు వంక చాలా ప్రేమపూర్వకమైన దృక్కులు సారించి పేడచేతుల్తో తనివి తీరా నమస్కరించి ఇంటికి వెళ్ళిపోయాడు.

కాలకృత్యాలు తీర్చుకుని భోజనం చేసి మెల్లగా సెంటర్‌గా నడిచెళ్ళాడు నిరంజనరావు. అక్కడ అతనికి ఇందాక తను ముద్రలు చేసిన నట్రాజు సినిమా వాల్ పోస్టరు కనిపించింది.

నిరంజనరావుకి నవ్వాగలేదు.

"హిహిహి..." పొట్టలోంచి తన్నుకొచ్చింది నవ్వు.

"హిహిహి..." తను నవ్వకపోయినా శబ్దం వచ్చింది! నిరంజనరావు ఆశ్చర్యంగా గొంతు తడుముకున్నాడు.

"హిహిహి..." మళ్ళీ వినిపించింది ఆ నవ్వు.

అనుమానంగా వెనక్కి తిరిగి చూశాడు నిరంజనరావు.

తన వెనకాల నిలబడి వెంకట్రావు నవ్వుతున్నాడు. వెంకట్రావు చూస్తున్న దిక్కుకే నిరంజనరావు చూశాడు.

అంతే... నిరంజనరావు నవనాడులూ కృంగిపోయాయ్.

తన అభిమాన హీరో భావరాజు సినిమా పోస్టర్ల మీద పేడముద్దలు!!...

"ఎవడ్రా మా అభిమాన హీరో... మా దైవం... మా గురువు... మా సర్వస్వం మీద పేడముద్దలు వేసిందీ?" వెంకట్రావుని చూస్తూ

Usha Nagasri.

హూంకరించాడు నిరంజనరావు.

"మా అభిమాన హీరోమీద పేడముద్దలు వేసినవాడే వేసుంటాడు..." తాపీగా సమాధానం ఇచ్చాడు వెంకట్రావు.

"అర్రేయ్!..." పిడికిలి బిగించి అరిచాడు నిరంజనరావు.

"ఒర్రేయ్!!..." రెండు పిడికిళ్ళూ బిగించి ఇంకా గట్టిగా అరిచాడు వెంకట్రావు.

"హూ... ఎల్లుండి మీవాడి సినిమా రిలీజౌతుందిగా... అప్పుడు చూపిస్తాం మా తడాఖా... భావరాజు అభిమానులంటే ఏంటో తెలిసొస్తుంది"

"ఆ... చూద్దాంగా... మీకూ మా సూపర్ హీరో నట్రాజు అభిమానుల పౌరుషం అంటే ఏంటో అప్పుడే తెలుస్తుంది" అన్నాడు వెంకట్రావు కాలరు ఎగరేస్తూ.

రెండ్రోజుల తరువాత నట్రాజు హీరోగా నటించిన సినిమా "అల్లరి చిల్లరి పిచ్చోడు" రిలీజైంది. నట్రాజు అభిమాన సంఘం ప్రెసిడెంటయిన వెంకట్రావూ మిగతా సంఘ సభ్యులూ ఉదయం ఆరుగంటలకే సినిమా హాలు చేరారు.

"ఏందయ్యా... ఏంది... ఆ?... అప్పుడే టిక్కెట్లు ఇవ్వరు... షోకి గంట ముందు ఇస్తారు..." అన్నాడు హాలు మేనేజరు.

"మేం నట్రాజు అభిమానులం... మాకేం పనీపాటా లేవు... బేకార్‌గాళ్ళం... కాబట్టి హాలుని అలంకరించాలని వచ్చాం" అన్నారు వాళ్ళు గర్వంగా.

"ఓ... అభిమానులా... అలాగే" అన్నాడు మేనేజరు.

వెంకట్రావు బృందం నట్రాజు నిలువెత్తు కటౌట్‌కి దండలు వేశారు. హాలు ఆవరణంతా రంగురంగుల కాయితం జండాలు కట్టారు. "సూపర్ హీరో నట్రాజ్ జిందాబాద్" అంటూ అట్టబోర్డుల మీద రాసి వేలాడగట్టారు.

సినిమా మార్నింగ్ షో టైమైంది. జనం వచ్చి క్యూలలో నిలబడ్తున్నారు. నిరంజనరావు బృందం కూడా సినిమాకి వచ్చారు.

అభిమాన సంఘాల వాళ్లకి టిక్కెట్లు ఇవ్వకపోతే ఏం గొడవొచ్చి పడ్తుందోనని మేనేజరు వెంకట్రావు బృందానికీ, నిరంజనరావు బృందానికీ క్యూలో నిలబడకుండానే టిక్కెట్లు ఇచ్చాడు.

సినిమా మొదలయింది.

వెంకట్రావు బృందం బాల్కనీనుండి తెరమీదికి పువ్వులు విసిరారు. నిరంజనరావు బృందం టిక్కెటు కౌంటర్ ఫాయిల్ ముక్కల్ని బాల్కనీ

నుండి విసిరారు.
కింద ఉన్న జనం నెత్తిమీద పడ్డ పువ్వుల రేకల్నీ, కాయితం ముక్కల్నీ శాపనార్థాలు పెట్టుకుంటూ దులుపుకున్నారు.
సినిమాలో నట్రాజు డైలాగులు వచ్చినప్పుడల్లా వెంకట్రావు బృందం చప్పట్లు కొట్టారు. నిరంజనరావు బృందం "బో... బో... బోర్" అంటూ అరిచారు.
నట్రాజు హీరోయిన్ దుబ్బశ్రీతో కలిసి డ్యూయెట్ పాడ్తూ స్టెప్పులేస్తుంటే వెంకట్రావు బృందం చిల్లర నాణాలు తెరమీదికి విసిరారు.
"ఒరేయ్... ఎవ్రా నా కొడకల్లారా..." అంటూ చిల్లర తగిలిన చోట తలల్ని తడుముకుంటూ కింది నుండి జనం అరిచారు.
నట్రాజు వేసే స్టెప్పుకి నిరసనగా నిరంజనరావు బృందం హాల్లోంచి వాకౌట్ చేశారు.
సినిమా అయిపోయింది.
"పాడుగోల... ఒక్క డైలాగు వినపడి చావలేదు... హీరోని అంత లైక్ చేస్తే తమ అభిమాన హీరో నటించిన సినిమా అందరూ శ్రద్ధగా చూసేలా అవకాశం కల్పించాలి గానీ... ఇదేం అభిమానం?"
జనం తలలు తడుముకుంటూ బయటికి వస్తూ అనుకున్నారు.
ఆ జనంలో నిరంజనరావుని వెతికి కాలరు పట్టుకుని, "మా అభిమాన హీరో సినిమాలో గోల చేస్తావా?" అని అడిగాడు వెంకట్రావు.
"నువ్వు పేడకొడ్తావా మా హీరో పోస్టరు మీద?" నిరంజనరావు కూడా వెంకట్రావు కాలరు పట్టుకున్నాడు.
అక్కడ నిరంజనరావు బృందానికీ, వెంకట్రావు బృందానికీ ఘర్షణ జరిగింది. పోలీసులు వచ్చి రెండు గ్రూపులనీ లాఠీలతో కొట్టి విడదీశారు.
"హు!... నా కాలర్ పట్టుకుంటారు కదూ?... వీడి హీరో పరువు తీయకపోతే నా పేరు నిరంజనరావే కాదు!!..." అని ప్రతిజ్ఞచేసి తిన్నగా 'సినీ జంతర్ మంతర్' పత్రిక ఎడిటర్ని కలిశాడు.
'సినీ జంతర్‌మంతర్'లో సినిమావాళ్లని దుయ్యబడ్తూ, అనేక రకాల గాసిప్స్ ప్రచురిస్తుంటారు.
నిరంజనరావు "నట్రాజుకి నటన ఏ మాత్రం రాదు... వాడు సినిమాల నుండి విరమించుకుంటే ప్రేక్షకులకు హాయిగా ఉంటుంది" అని భావరాజు అభిమాన సంఘం పేర ఒక ఉత్తరం రాసి ఎడిటర్‌కి ఇచ్చాడు.
ఎడిటర్ దాన్ని ప్రచురించాడు. దాన్ని చూసిన వెంకట్రావు, తనూ

నట్రాజు అభిమాన సంఘం పేరు ఒక లెటర్ ఎడిటర్‌కి ఇచ్చాడు.
దాన్నీ ఎడిటర్ ప్రచురించాడు.
దాంట్లో భావరాజుకి దొడ్డికాళ్లని రాశాడు వెంకట్రావు.
నట్రాజుకి గూని అని నిరంజనరావు తరువాతి సంచికలో రాశాడు.
భావరాజుకి నత్తి అని వెంకట్రావు రాశాడు. ఇలా ఒకరికొకరు పోటీలు పడి తిట్టుకుంటూ రాస్కోడంతో ఆవేశాలు పెరిగిపోయాయి.
ఒకరోజు రాత్రి ఒంటరిగా ఒకరినొకరు ఎదురుపడ్డారు. హఠాత్తుగా ఇద్దరూ కత్తులు దూసి ఒకర్నొకరు పొడుచుకున్నారు. ఇద్దరూ చచ్చారు.
అదే రోజు రాత్రి మద్రాసులో ఒక సినీతారల ఫంక్షన్‌లో నట్రాజూ భావరాజూ కలుసుకున్నారు. ఒకరినొకరు అప్యాయంగా కౌగిలించుకున్నారు.
కలిసి తాగి కలిసి భోజనం చేశారు వాళ్ళిద్దరూ ఆ రాత్రి.
వాళ్లు బాగానే ఉంటారు... తన్నుకు చచ్చేది ఈ అభిమానులే!...
ప్రస్తుతం స్వర్గలోకంలో రంభ అభిమాన పార్టీని వెంకట్రావు పెడ్తే, ఊర్వశి అభిమాన పార్టీని నిరంజనరావు పెట్టాడు.

* * *